క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి



కాశిపాడులో జ్వరబాధితులకు మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: భారీ వర్షాల కారణంగా ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని గణపవరం, పిప్పర పిహెచ్‌సీ వైద్య అధికారులు ప్రజలకు సూచించారు. తుపాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వైద్య సిబ్బంది గ్రామాల్లో ఫీవర్‌సర్వే నిర్వహిస్తూ, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే, ఫీవర్ సర్వేలు నిర్వహించారు.

శివనామస్మరణతో మారుమోగిన గ్రామోత్సవం



భీమడోలులో భారీ ఊరేగింపుగా గ్రామోత్సవం చేస్తున్న శివస్వామి మాలధారులు

భీమడోలు: కార్తీకమాసంలో భాగంగా భీమడోలులోని శివమాలధారులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మాలధారులంతా పురవీధుల్లో భారీ ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. శివనామస్మరణతో గ్రామం మారుమోగింది. భీమడోలు గోదావరి కాల్వ గట్టుపై వేంచేసియున్న పార్వతీ సమేత భీమేశ్వరస్వామి శివ దీక్షాపీఠానికి చెందిన శివ మాలధారులు గురుస్వామి పేరాబత్తుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుందరంగా అలంకరింపబడిన ట్రాక్టర్‌పై పార్థివ లింగాన్ని ఊరేగించారు. శివస్వాములు శివ తాండవంచేస్తూ మేళాతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా కాలుస్తూ స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తుపానుతో స్తంభించిన జనజీవనం



గణపవరం ఏలూరు రోడ్డుపై నిలిచిన నీరు

గణపవరం: తుపాన్ ప్రభావంతో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లమీద నీరు చేరడంతో వాహనాలు ఆనీటిగుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. దీనితో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి జోరుగా వర్షం కురుస్తూనే ఉంది. కొంతసేపు మోస్తరు వర్షం, కొంత సమయం భారీ వర్షం పడుతూ జనం ఇళ్లనుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. భారీ వర్షాలకు రోడ్లమీదికి నీరుచేరి, రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మరోప్రక్క ఎడతెరిపి లేని వర్షాలకు సార్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుపాన్‌కు ముందు 50 శాతం రైతులు మాసూళ్లు పూర్తిచేసి ధాన్యం ఒబ్బిడి చేసుకున్నారు. మిగిలిన రైతులు కోతలు కోయకుండా మిగిలారు. వారంతా భారీ వర్షాలకు పంట ఎక్కడ పాడైపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. పిప్పర, కేశవరం, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కొందేపాడు, అర్ధవరం,ముగ్గుళ తదితర గ్రామాల్లో చాలా వరకూ వరిపైరు నేలపై పడిపోయింది. మిచాంగ్ తుపాన్‌తో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో కురుస్తోన్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను, వరద ముంపునకు గురైన నిరాశ్రయులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం 37 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవడంతో పొలాలు, పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, వరి, పత్తి, పొగాకు తదితర పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయగా ఇప్పటికే 89 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయని, వీటిలో 20 వేల టన్నుల ధాన్యం నేటికీ కొనుగోలు కాలేదని వివరించారు. రైతుల ధాన్యాన్ని రక్షించుకునేందుకు బరకాలు సరఫరా చేయాలని, పంటను కొనుగోలు చేయాలని కోరారు.

వణికిస్తున్న మిచాంగ్

- తుపాను ప్రభావంతో గుబులు
- లోతట్టు ప్రాంతాల జలమయంతో ఇబ్బందులు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



దెందులూరు: కొవ్వలిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



దెందులూరు: నీటమునిగిన వరి పనలు



పెదవేగి: నేలకొరిగిని వరి చేను



పెదవేగి: అంకన్నగూడెంలో చెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

భీమడోలు: మిచాంగ్ తుఫాన్ రైతన్నల గుండేల్లో అలజడి రేపుతోంది. వాతావరణం మారి ఈదురు గాలులు, వర్షం పడుతుండడంతో ఇబ్బంది నెలకొంది. భారీ వర్షానికి రైతులు ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు వారి పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉంది. సోమవారం 34.2 మిల్లీ మీటర్ల, మంగళవారం 137 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండల వ్యాప్తంగా పూళ్ల, దుద్దేపూడి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో 120 ఏకరాల్లోని పంట నేల వారగా, సుమారు 500 మెట్రిక్ ధాన్యం తడిచినట్లు ఏవో ఎస్‌పీవీ ఉషారాణి మంగళవారం రాత్రి తెలిపారు. తుఫాన్ వల్ల ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురుస్తుండడంతో రైతులు మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రధాన రహదారులు, వ్యవసాయ క్షేత్రాలు, పుంత రోడ్లపై ఉన్న ధాన్యాన్ని బరకాలు, టార్పాలిన్లతో కప్పి ఉంచి ధాన్యాన్ని కాపాడుకుంటున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ధాన్యం సంరక్షించుకునేందుకు రైతులు కంటిపై కునుకు లేకుండా కష్టపడుతున్నారు. ఎప్పటికప్పుడు బరకాలపై పడిన నీటిని బయటకు పంపుతున్నారు. ఖాళీ స్థలాల్లో వేసిన ధాన్యం రాసుల చుట్టూ నీరు చేరకుండా రైతులు గాడులు తీస్తున్నారు. ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో మిల్లులకు ధాన్యం తరలించడం, తేమశాతంపై నిబంధనలు ఎత్తివేసినప్పటికీ వరుణుడు ధాటికి ధాన్యం మిల్లులకు చేర్చే పరిస్థితి కనిపించలేదు. కోసేందుకు సిద్ధంగా ఉన్న పంటంతా నేలకు వాలిపోతుంది. గత పదేళ్లలో ఇలాంటి వర్షాలు సార్వా సీజన్‌లో చూడలేదని రైతులు వాపోతున్నారు. వానదేవుడు కరుణిస్తేనే రైతులకు మేలు జరుగుతుందని లబోదిబోమంటున్నారు. పల్లపు ప్రాంతాల్లో వేసిన ధాన్యం రాసుల చుట్టూ నీరు చేరడంతో రైతులు నీటిని ఇంజన్లు పెట్టి తోడుతున్నారు. మండలంలో 13వేల ఏకరాల్లో 10వేల ఏకరాల్లో పంట కోసారు. వాటిలో 50శాతం మాత్రమే మిల్లులకు చేరింది. మిగిలిన ధాన్యం రోడ్లపై, వ్యవసాయక్షేత్రాలు ఉంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

తుపాను బీభత్సంతో... చీకట్లో మండలం

నిడమర్రు: మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మంగళవారం కూడా ఉధృతంగా కొనసాగాయి. దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మంగళవారం నిడమర్రు మండలంలో 152 మి.మీ వర్షపాతం నమోదైనట్లు బి. సాయిరాజు తెలిపారు. దీంతో పలు చోట్ల చెట్లు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బువ్వనపల్లి- నారాయణపురం రహదారి వెంబడి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిడమర్రు-నారాయణపురం ఆర్ అండ్‌బీ రహదారిపై పలు చోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. మండలంలో 3484 ఎకరాల్లో వరి సాగు జరిగింది. 9929 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభించగా 6924 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే కొనుగోలు చేసినట్లు ఏవో గీత తెలిపారు.

ఉంగుటూరులో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం

ఉంగుటూరు (నిడమర్రు): తుపాను ప్రభావంతో ఉంగటూరు మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 171 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కైకరం, ఉంగుటూరు తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో అక్కడ ఉన్న ధాన్యం రాశులు నీటిలో నానుతున్నాయి. మండల వ్యాప్తంగా పలుచోట్ల చెట్లు విరిగి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారి వెంబడి ఉన్న భారీ చెట్లు విరిగిపోయి రహదారికి అడ్డంగా వరిగిపోవడంతో హైవేపైనా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సీఐ సుభాష్, ఎస్సై స్వామి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

దెందులూరులో...

దెందులూరు: మిచాంగ్ తుపాను మండలంలో జనజీవనాన్ని స్తంభింపజేసింది. అన్ని గ్రామాల్లో రైతులు గత రెండు రోజులుగా టార్పాలిన్లతో ధాన్యాన్ని భద్రపరిచినప్పటికీ వర్షపు నీరు ధాన్యం చుట్టూ చేరింది. కొవ్వలి గ్రామాల్లో కోసిన పంట మునిగిపోయింది. అలాగే పెరుగ్గూడెం- ద్వారకాతిరుమల ప్రధాన రహదారి ముంపుకు గురైంది. కొవ్వలి ఉన్నత పాఠశాల రోడ్డు మునకకు గురికావడమే కాకుండా చెట్లు ఒరిగిపోయాయి. జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు, వ్యవసాయ శాఖ ఏఓ గద్దె రమేష్, జిల్లా అధికారులు అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించారు. రైతులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఉండ్రాజవరంలో పండించిన ధాన్యం టార్పాలిన్లతో భద్రపరిచినప్పటికీ నీళ్లు ధాన్యం చుట్టూ నిలిచిపోవడంతో రైతులు కన్నీటిపర్యవంతవుతున్నారు. బుధ, గురువారాల్లో వర్షం రాకుండా ఉంటే నష్టం పెద్దగా ఉండదని ఈ రెండు రోజుల్లో ఏ ఒక్క రోజూ వర్షం కురిసినా తమ కష్టం వృథా కావడమే కాకుండా తమకు ఊహించని నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు

వాతావరణ శాఖ మిచాంగ్ తుపాను కారణంగా ఏలూరు జిల్లాకు రెడ్‌అలెర్ట్ ప్రకటించడం పట్ల దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గ రైతులకు, ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు. నియోజకవర్గంలో రైతులకు, ప్రజలకు ఏ సహాయం కావాలన్నా వలంటీర్‌కు, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎమ్మెల్యే కార్యాలయానికి తెలియజేయాలన్నారు. తుపాను నేపథ్యంలో ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని వివరించారు. 70134 64909, 94949 06979, 98485 05695 నెంబర్లు నియోజకవర్గ ప్రజలు, రైతులు సహాయాన్ని కోరవచ్చని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తెలిపారు.

పెదవేగిలో...

పెదవేగి: మిచాంగ్ తుపాను దాటికి పంటపొలాలు నీటమునిగి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భోగాపురం, అమ్మపాలెం, కొప్పాక, పినకడిమి తదితర గ్రామాల్లో వరిపైరు దెబ్బతింది. కోసిన పనలు నీటిలో తేలియాడుతుండడంతో ధాన్యం అక్కరకు రాదని వాపోతున్నారు. పెదవేగిలో ప్రధాన రహదారిపై నీరు పారుతుండడంతో వాహనచోదకులకు కొంతమేర ఇబ్బందికర పరిస్థితిలో ప్రయాణిస్తున్నారు. తడిసి, పాడైన పంటలను పెదవేగి తహసీల్దార్ ఎస్.నాగరాజు, ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్, మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక ఆయా గ్రామాల్లో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు రైతులకు భరోసా కల్పించారు. మండలంలో మొత్తం 6031 ఎకరాల్లో వరిసాగు జరుగగా, వెయ్యి ఎకరాల్లో కోత పూర్తయ్యిందని, మిగిలిన పంట కోతకు సిద్ధంగా ఉందని ఏఓ ప్రియాంక తెలిపారు. కోతకు వచ్చిన వరి ఈదురుగాలుల తీవ్రతకు ఒరిగిపోయిందని, వర్షాలు తగ్గిన తరువాత మాత్రమే కోతకు అనువుగా ఉంటుందని ఆమె చెప్పారు. నేలవాలిన కంకులు మొలకలు రాకుండా వర్షం తగ్గిన వెంటనే ఉప్పునీటిని పిచికారి చేయాలని ఆమె రైతులకు సూచించారు. వరిపైరుతోపాటు ఉద్యానపంటలకు కొంతమేర నష్టం వాటిల్లిందని ఏఓ తెలిపారు.కూరగాయల పాదులకు నష్టం ఉంటుందని పేర్కొన్నారు.



భీమడోలు: ధాన్యం రాసుల చుట్టూ నీరు నిలవకుండా గాడులు తీస్తున్న రైతు



నిడమర్రు: బువ్వనపల్లిలో నీటిలో నానుతున్న ధాన్యం రాశులు



ఉంగుటూరు: కైకరం బీసీ కాలనీలో నీటమునిగిన ధాన్యం రాశులు

రైతులను ఆదుకుంటాం



పెదపాడు: నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పెదపాడు: ధాన్యాన్ని తరలించే అవకాశం ఉంటే వెంటనే మిల్లులకు చేర్చాలని జిల్లా కలెక్టరు వె.ప్రసన్న వెంకటేష్ రైతులకు సూచించారు. మండలంలోని సీతారామపురం, వట్లూరు గ్రామాల్లో భారీ వర్షాలకు మునిగిన పంట పొలాలను జాయింట్ కలెక్టరు బి.లావణ్యవేణితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా కచ్చితంగా భరోసా కల్పిస్తామని తెలిపారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా ఆఫ్లైన్ పద్ధతిలో మిల్లులకు తరలించుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని, ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. సీతారామపురం రైతులు కళ్లాల్లో భద్రపరిచిన ధాన్యాన్ని కలెక్టరు పరిశీలించారు. అనంతరం ప్రస్తుతం పంట పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వట్లూరులో నేలకొరిగిన వారి పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజు భార్గవి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు, వ్యవసాయ శాఖ ఏడీ వై.సుబ్బారావు, వ్యవసాయ అధికారి వి.ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జోరు వానలో ఏలూరు ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలితో కలిసి మంగళవారం భీమడోలులోని వ్యవసాయక్షేత్రాలను ఆయన సందర్శించారు. రైతులు కళ్లాలు, ఖాళీ స్థలాల్లో ఉంచిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు రైతుల వద్ద నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆధైర్యపడొద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సాగు సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏడీఏ పి.ఉషారాజకుమారి, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసిల్దార్ ఎం.ఇందిరా గాంధీ, ఈవోఆర్డీ ఏ.సుందరి, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, వీఆర్వో వెజ్జు వినయ్‌కుమార్, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

9న ఎన్‌పీఆర్‌డీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (టూటౌన్): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) సర్వసభ్య సమావేశం ఈనెల 9న ఏలూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాడి నటరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఐక్య కార్యాచరణ రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా గౌరవ అధ్యక్షుడు బుద్దా సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పళ్లెం వెంకటేశ్వరరావు, జిల్లా మహిళాఅధ్యక్షురాలు ఎస్‌కే సుభాషిణి హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి

చింతలపూడి: భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఉద్యాన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చింతలపూడి ఉద్యాన వన శాఖ అధికారిణి ఎండీ షాఫియ పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ముందుగా తోటలో నిలిచినా నీటిని బయటకి పంపించాలన్నారు. కూరగాయల తోటలకు సంబంధించి వర్షాలు తగ్గాక 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలు పిచికారీ చేయాలన్నారు. పొలంలో నీరు నిలవడం వలన ఎండు తెగులు, ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రామ ఒక లీటరు నీటికి, కార్బన్‌డిజమ్ 1 గ్రామ 1లీటరు నీటికి మొక్క మొదల్లో పోయాలన్నారు. అరటి తోటలకు సంబంధించి మొక్కలకు కర్రలు కట్టాలన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



కొత్తూరు గ్రామంలో పంటపొలాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: తుఫాను వీడిన వెంటనే రైతులకు అపరాల విత్తనాలు అందించాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ వ్యవసాయ అధికారులను కోరారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో మిచాంగ్ తుఫాను కారణంగా మండలంలో నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. నీట మునిగిన పంటలను రైతులు ఆమెకు చూపించారు. 24 గంటల పాటు నీటిలో ఉంటే వరి కంకులు మెలకలు వచ్చే అవకాశం ఉందని రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. వెంటనే రైతులకు జరిగిన నష్టాన్ని అంచనాలు వేసి అందించాలన్నారు. రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉంచి వారికి నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. మినుము, పెసర విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వై.సుబ్బారావు, వ్యవసాయఅధికారి ప్రదీప్ కుమార్‌లకు రైతులకు అందుబాటులోఉంటూ సలహాలు అందించాలని సూచించారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ కడిమి పద్మావతి, నాయకులు కడిమి గోవిందరావు, బత్తుల ఏసురాజు, బాల్ద ప్రసాద్, సీహెచ్ సాయి శ్రీనివాస్, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టిన సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తుఫాన్ ప్రభావంతో విద్యుత్ ప్రసారంలో ఏర్పడిన అంతరాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లపై పడిన విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో ఏర్పడిన లోపాలను సరిచేసేందుకు జిల్లా వ్యాప్తంగా తమ సిబ్బంది అప్రమత్తం చేశామన్నారు. వారంతా పునరుద్ధరణ పనులు చేపట్టారని తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో విద్యుత్ లైన్లపై పడిన ఎండిన పామాయిల్ చెట్టును తొలగించారన్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో లైన్లపై పడిన చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు చెప్పారు. కుక్కునూరు మండలం దాచారంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణతో పాటు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



భీమడోలులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో మంగళవారం జోరువానలో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.35లక్షలతో నిర్మించిన సచివాలయం నెం.1, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50లతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. భీమడోలులో మంగళవారం జోరువానలో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.35లక్షలతో నిర్మించిన సచివాలయం నెం.1, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50లతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్ని ప్రాంతాల ప్రజలు బాగుండాలని సదుద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని అన్నారు. మరో వైపు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. అధిక వర్షాలు నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆధైర్యపడద్దన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా సాగు సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఆల్తి గోపి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటి సభ్యుడు చింతా శ్రీరామచంద్రమూర్తి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఏడీఏ పి.ఉషారాజకుమారి, వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మీ, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, నాయకులు అంబటి నాగేంద్ర ప్రసాద్, చింతా చందు, ఆల్తి సురేష్, గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్, వీఏఏ, వైద్య ఆరోగ్య సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.